# కుల గణన తప్పుల తడక

## బీసీల కుల గణనలో ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రకటించాలి

గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ



చిక్కడపల్లి, ఫిబ్రవరి 6: బీసీ కుల గణన వివరాలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ వెబ్ సైట్‌లో పొందుపరిచి ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రకటించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ అంబాల నారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. బాగ్ లింగంపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణనపై వస్తున్న ఆరోపణలు, విమర్శలు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిగమించాలి. వెంటనే కుల గణన వివరాలు రాష్ట్రంలో బీసీ కులాల జనాభా ఎంతో వివరణ పట్టిక విడుదల చేయాలన్నారు. బీసీ కులాల జనాభా, ఏయే కులాల జనాభానో, రాష్ట్రంలో ఏయే జిల్లాల్లో ఎంత? మండలంలో ఎంత? గ్రామ స్థాయిలో ఎంత జనభా ఉన్నదో? పట్టిక ప్రభుత్వ వెబ్సైట్‌లో వెంటనే ప్రకటించాలని, ఇదే సందర్భంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## సర్వే మళ్లీ నిర్వహించాలి - తలసాని శ్రీనివాస్ యాదవ్



పద్మారావునగర్‌లో మీడియాతో మాట్లాడిన తలసాని

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 6: కుల గణన సర్వే తిరిగి నిర్వహించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన పద్మారావునగర్‌లో మీడియాతో గురువారం మాట్లాడుతూ 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేకు, 2024లో నిర్వహించిన కుల గణన సర్వేకు జనాభా లెక్కలలో భారీ వ్యత్యాసం ఉన్నదన్నారు. పదేండ్ల తరువాత జనాభా 62 లక్షలు తగ్గిందని, వారంతా ఎటుపోయారో ప్రభుత్వమే చెప్పాలని ఆయన అన్నారు. కుల గణన అంతా తప్పుల తడకగా, గందరగోళంగా ఉన్నందున తిరిగి సర్వే చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలోనే మద్దతు ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు. వర్గీకరణ అనంతరం, ఎస్సీలలో నెలకొన్న అయోమయాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తలసాని అన్నారు.

## బీసీల కుల గణన అంతా బూటకం

బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఐలన్న



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఐలన్న

మల్కాజిగిరి, ఫిబ్రవరి 6: బీసీల కుల గణన సరిగా జరగలేదని, అదంతా బూటకమని బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఐలన్న అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ సఫిల్‌గూడలోని కార్యాలయంలో బీసీ కులాల ఐక్య వేదిక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఐలన్న మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన సర్వే తప్పుడు తడకలా ఉందన్నారు. బీసీ వర్గాలను తక్కువ చేసి చూపారని, బీసీలు అధిక జనాభా కలిగి ఉండి సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలన్నింటిలో వివక్షకు నిర్లక్ష్యానికి గురైందన్నారు. రాజ్యాధికారంలో న్యాయమైన వాటా సాధించేవరకు పోరాడుతామని ఆయన అన్నారు. 8న ఆనంద్‌బాగ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రమేశ్ గౌడ్, రామ్మోహన్, నాగరాజు, నవీన్, శ్రీనివాస్, దశరథ్, వెంకటయ్య, లక్ష్మీనారాయణ, గోపాల్, నరసింహాచారి, కృష్ణా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల రిజర్వేషన్లపై చట్టం చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



అభివాదం చేస్తున్న బీసీ సంఘం నేతలు ఎర్ర సత్యనారాయణ, మల్లేశ్, రామకృష్ణ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన వాస్తవాలు పూర్తి అసత్యంగా ఉన్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బీసీల పొట్ట గొట్టి, ఓసీలను పెంచి పోషించేందుకే రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు రిపోర్ట్ ఇచ్చిందని ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీల జనాభా 56 శాతం ఉందని, 1978 నుంచి చేసి ప్రతి సర్వేలో తేలిందని, కాని, 10% కోతపెట్టి 46%గా లెక్కలు చూపిస్తున్నారని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 6.5% ఉన్న ఓసీలను మాత్రం 16 శాతం చూపిస్తూ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునేందుకు లెక్కల గారడి చేశారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బీసీల రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు మోసం చేసే పార్టీలకు మనుగడ ఉండదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీసీలు బొందపెట్టడం ఖాయమన్నారు. జాతీయ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రతిరోజు ఓబీసీల కుల గణన చేయాలని దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తుంటే, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం సీఎం రేవంత్ రెడ్డి బీసీల జనాభా లెక్కలు తగ్గించి మరోమారు బీసీలకు కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందన్నారు. తక్షణమే కుల గణనపై రీసర్వే చేయించి 42% రిజర్వేషన్ల చట్టం చేసి, ఆ తరువాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో గొరిగె మల్లేశ్, వి.రామకృష్ణ, కె.జనార్ధన్, సుధాకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



## మర్యాద పూర్వక కలయిక

బీఆర్‌ఎస్ పార్టీ అసెంబ్లీ విప్‌గా నియమితులైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శాసన సభ్యులు కేపీ వివేకానంద్, శాసన మండలి విప్‌గా నియమితులైన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌లు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును నానక్‌రామ్‌గూడలోని ఆయన ఇంటిలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు వివేకానంద్, సత్యవతి రాథోడ్‌ను అభినందించడంతో పాటు శుభాకాంక్షలు తెలియజేశారు.

*– దుండిగల్, ఫిబ్రవరి 6;*



అధికారులకు సూచనలిస్తున్న వెంకటాచారి, చిత్రంలో పలువురు అధికారులు

## కంబైండ్ జియో సైంటిస్ట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ కంబైండ్ జియో సైంటిస్ట్ ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అన్నారు. 9న జరగబోయే ఈ పరీక్షకు హైదరాబాద్ వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లపై కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లు, అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. వెంకటాచారి మాట్లాడుతూ, పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. 3 కేంద్రాల్లో 803 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం సెషన్ 9:30 గంటల నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం సెషన్ 2:00 గంటల నుంచి 4:00 వరకు ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు ఒరిజినల్ ఐడీ కార్డుతో పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. సమావేశంలో రూట్ అధికారులు, లోకల్ ఇన్స్పెంటింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మాలల ద్రోహి కాంగ్రెస్ ప్రభుత్వం: డా. వీఎల్ రాజు

4న తెలంగాణ రాష్ట్ర బంద్



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్, డా. వీఎల్ రాజు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 6: ఎస్సీ వర్గీకరణపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్టం చేసి అమలు చేస్తామని నమ్మించి, కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన మాలలకు ఆ పార్టీ తీవ్ర ద్రోహం తలపెట్టిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 14న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. వీఎల్ రాజు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్‌లు పాల్గొని ప్రసంగించారు. వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ జస్టిస్ షామీర్ అక్తర్ నివేదికను ఆమోదించే ముందు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి రాజ్యాంగ నిబంధనలు పాటించలేదని, జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆర్టికల్ 338 ప్రకారం, సంప్రదించకుండా ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణను ఆమోదించారని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆజెండాను అమలు చేయడంలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకే సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఆర్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ కుట్రలు పన్ని, డ్రామాలు, కుట్రలు చేసి మాలలను అణివేయడానికి సిద్ధం అయ్యారన్నారు.

## ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలి

సోషలిస్ట్ కూటమి ప్రతినిధులు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాలు, మేధావులు, సోషలిస్ట్ కూటమి ప్రతినిధులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 6: ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కల్పించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం అందించాలని పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులతో సోషలిస్ట్ కూటమి ప్రతినిధులు అన్నారు. బషీర్‌బాగ్‌లో సోషలిస్ట్ కూటమి ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సోషలిస్ట్ కూటమి జాతీయ చైర్మన్ యల్.జై బాబు మాట్లాడుతూ, ప్రైవేట్ రిజర్వేషన్‌లో విద్యా, ఉపాధిలో 75 శాతం స్థానిక కోటా కల్పిస్తూ జార్ఖండ్, హర్యానా రాష్ట్రాలు కల్పించిన ప్రైవేట్ రిజర్వేషన్ చట్టాలు హైకోర్టులు నిలుపుదల చేశాయని, సుప్రీం కోర్టు ఆశ్రయించగా చట్టం చేసే పరిధి రాష్ట్రానిది కాదని, స్వేచ్ఛా సమానత్వాల ఉల్లంఘన జరుగుతుందని తీర్పులు ఇస్తున్నాయని, అదే బాటలో కర్ణాటక రాష్ట్రంలో చట్టం అమలులో ఉందని, దీని బాటలో ప్రైవేట్ రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల హామీలో తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు ప్రతిభను కాపాడాలని, రిజర్వేషన్లను ఎత్తివేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించడం ప్రజాస్వామ్య విలువలను, సామాజిక న్యాయ సూత్రాలకు, దేశ అభివృద్ధిని ధిక్కరించడమేనన్నారు. దేశంలో ప్రభుత్వ ఉద్యోగులు కోటి 76 లక్షల మంది ఉంటే ఎస్సీ, ఎస్టీలు కలిపి 5%, ఓబీసీలు 4% ఉన్నారని, 10% కూడా లేని ప్రభుత్వ రంగంలో ఉద్యోగవకాశాలు తగ్గిపోతున్నాయని, 2050 నాటికి 0.5కి పడిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రైవేట్‌లో రిజర్వేషన్ల కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామన్నారు. సదానందం, రవి, తిరుపతి, జానకి రాములు, రాజలింగం, బాలకృష్ణ, పాల్గొన్నారు.



## డైరీ ఆవిష్కరణ

తెలంగాణ ఎలక్ట్రిసిటీ దివ్యాంగ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సరం డైరీని మంత్రి సీతక్క చేతుల మీదుగా గురువారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రవణ్ కుమార్, ఇందూర్ రోషన్, కోశాధికారి సాంబశివరావు, గౌతమ్ నాగ్, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

*– ఖైరతాబాద్;*



## నగరంలో టీవీఎస్ తొలి డీలర్‌షిప్ ప్రారంభం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): నగర ప్రజలకు అత్యున్నతమైన, నాణ్యత కలిగిన ఉత్పత్తులు, సేవలను అందించాలనే లక్ష్యంతోనే నగరంలోఎంఎస్‌ఏ గ్రూప్ తొలి టీవీఎస్ డీలర్‌షిప్‌ను ప్రారంభించినట్లు టీవీఎస్ మోటార్ కంపెనీ సేల్స్ జనరల్ మేనేజర్ కేంద్రాక్ జోషి తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలో మొదటి డీలర్‌షిప్ ఏర్పాటు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్‌ఏ గ్రూప్ ఆటోమోటివ్ పరిశ్రమలో విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందిందని చెప్పారు. ద్విచక్ర వాహనాల అమ్మకాలు, సేవలు, విడి భాగాలలో శ్రేష్టతో కూడినవని స్పష్టం చేశారు.

## మార్కెట్‌లోకి మారుతి సుజుకీ ఈ-విటారా




సిటీ బ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): బంజారాహిల్స్‌లోని వరుణ్ మోటార్స్ మారుతి సుజుకీ మొట్టమొదటి ఎలక్ట్రిక్ కారు ఈ-విటారాను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ మేరకు గురువారం జరిగిన కార్యక్రమంలో సౌత్ ఈస్ట్ రీజియన్ కమర్షియల్ బిజినెస్ హెడ్ వినీత్ జైన్ పాల్గొని ఈ-విటారా కారును లాంచ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ తెలంగాణ రీజినల్ మేనేజర్ అమిత్ కుమార్ సింగ్, కార్పొరేట్ జోనల్ మేనేజర్ సాహిల్ అరోరా, వరుణ్ గ్రూప్ డైరెక్టర్ డీకే రాజు, జనరల్ మేనేజర్ శ్రీధర్ పాల్, బ్రాంచ్ హెడ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 18లోగా చెరువులపై నివేదిక ఇవ్వాలి

హెచ్‌ఎండీఏకు హైకోర్టు ఆదేశం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): చెరువుల హద్దుల నిర్ధారణ పురోగతిపై ఈ నెల 18న సమగ్ర నివేదికను అందించాలని హెచ్‌ఎండీఏను హైకోర్టు మరోసారి ఆదేశించింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువుల హద్దుల నిర్ధారణ, పరిరక్షణ అంశాన్ని హైకోర్టు పర్యవేక్షిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను వేగంగా గుర్తించి ఫిబ్రవరి 18న జరిగే విచారణ రోజు నివేదిక అందజేయాలని సూచించినట్లు హెచ్‌ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. నగరంలో ఇప్పటివరకు 928 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీ చేయగా.., ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీయైన జాబితాలో 1994 చెరువులు ఉన్నాయి. ఈ క్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ మ్యాపులను పరిశీలించుకుంటూ హద్దుల నిర్ధారణ సాగుతున్నట్లుగా తెలిపారు. ఏడు జిల్లాలలో విస్తరించిన హెచ్‌ఎండీఏకు చెందిన హద్దుల నిర్ధారణ వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లుగా వివరించారు.

## 11 నుంచి జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ప్రఖ్యాత చిత్రకారుల విభిన్న శైలుల కళాత్మక ప్రదర్శన ఆర్టివల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్ కంటినమ్ శీర్షికతో ముంబైలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఈ నెల 11 నుంచి 17 వరకు జాతీయ స్థాయి ఆర్ట్ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకురాలు సుష్మా సబ్నిమ్ గురువారం తెలిపారు. సమకాలీన కళాకారుల కలయికతో కూడిన ఈ ప్రదర్శనలో ఒకరి భావాలను మరొకరు పంచుకొని కళాత్మక పరిమాణాన్ని ఇనుమడింపజేసే వేదికగా మారనుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సాంస్కృతిక కళా వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే తపనతో పలువురు ప్రముఖ చిత్రకారుల కళా ఖండాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరనున్నాయని వెల్లడించారు. పూర్వీకుల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, చిత్రకళలు, సమకాలీన అంశాలు, గ్రామీణ ప్రజల జీవనశైలి, కట్టుబొట్టు తదితర అంశాలు, ప్రకృతి సౌందర్య దృశ్యాల సమాహారంగా కళాకారుల మదిలలోని అంశాల కళాత్మక చిత్రాలతో కూడిన అపురూప ప్రదర్శనలతో పాటు వర్ధమాన కళాకారులకు కళాత్మక అంశాలపై సోదాహరణంగా వివరించే సదస్సులు కొనసాగుతాయన్నారు.

## పురుషాంగాన్ని పునః సృష్టించిన మెడికవర్

15 ఏండ్ల ఇబ్బందులను పరిష్కారం చూపిన వైద్య బృందం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైద్యులు

కొండాపూర్, ఫిబ్రవరి 6: ఇన్ఫెక్షన్‌కు గురై కోల్పోయిన పురుషాంగాన్ని వైద్యులు పునర్నిర్మించి యథావిధిగా అమర్చిన హైటెక్ సిటీ మెడికవర్ దవాఖాన వైద్యులు యువకునికి కొత్త జీవితాన్ని అందించారు. చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను గురువారం దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్ డాక్టర్ రవి కుమార్ వెల్లడించారు. సోమాలియాకు చెందిన యువకుడి(19)కి నాలుగేండ్లున్నప్పుడు సున్తీ చేశారు. కాగా, సున్తీ సమయంలో ఇన్ఫెక్షన్‌తో అతని పురుషాంగం పూర్తిగా కోల్పోయాడు. మూత్ర విసర్జన సైతం కూర్చొని చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎన్నో ఏండ్లుగా అనేక మంది వైద్యులను కలిసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. తమ సమస్యతో మెడికవర్ దవాఖానకు వచ్చిన సదరు యువకుడికి యూరాలజిస్ట్, అండ్రాలజిస్ట్, ప్లాస్టిక్ సర్జన్‌ల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి, యువకుడికి పురుషాంగంతో పాటు వృషణాలను పునః సృష్టించేందుకు చికిత్సను ప్రారంభించారు. యువకుడి మంజేయికి మైక్రో వాస్క్యులర్ సర్జరీ ద్వారా రేడియల్ ఆర్టెరీ ఫోర్ ఆర్మ్ ఫ్లాప్ నుంచి పురుషాంగాన్ని పునః సృష్టించారు. 10 గంటలకు పైగా శ్రమించిన వైద్య బృందం యువకుడి పురుషాంగాన్ని యథావిధిగా అమర్చారు. ప్రస్తుతం, యువకుడు పూర్తిగా కోలుకుని సాధారణ పురుషుల మాదిరిగా మూత్ర విసర్జన చేస్తున్నాడు. గత సంవత్సరం శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందం వారం రోజుల క్రితం యువకుడి పురుషాంగంలో పినైల్ ఇంప్లాంట్‌ను విజయవంతంగా అమర్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో వివాహం చేసుకుని సంసారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ దాసరి మధు వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మీడియా వినియోగంతో ప్రింట్‌లో సంక్షోభం

సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్



మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6: ప్రజల్లో డిజిటల్ మీడియా వినియోగం రోజురోజుకూ పెరిగిపోతుండటంతో ప్రింట్ మీడియా రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొ. ఎస్.బషీరుద్దీన్ 89వ జయంతి సందర్భంగా 'ప్రింట్ మీడియా – సంక్షోభం – భవిష్యత్తు' అనే అంశంపై గురువారం స్మారకోపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, డిజిటల్ మీడియా వినియోగం, ఎలక్ట్రానిక్ మీడియా విస్తరణ పెరగడంతో కొంతకాలంగా అనేక వార్తా పత్రికల సర్క్యులేషన్, ప్రకటనల ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. చాలా పత్రికలు నిలదొక్కుకునేందుకు ఇబ్బంది పడుతున్నాయన్నారు. కాగా, డిజిటల్ మీడియా వినియోగం పెరుగుతున్న తరుణంలో తప్పుడు వార్తలు కూడా వేగంగా వ్యాపిస్తూ సమాజానికి చెడు చేస్తున్నాయన్నారు. నాణ్యమైన వార్తలను అందించే ప్రింట్ మీడియాను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి, అకడమిక్ డైరెక్టర్ ప్రొ. జి.పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ. విజయ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రెండు నెలల్లో ఆర్టీఏ కార్యాలయం కూల్చివేత

రోడ్డు విస్తరణలో.. తొలగింపునకు రంగం సిద్ధం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 ( నమస్తే తెలంగాణ ) : రోడ్డు విస్తరణలో భాగంగా తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయం తొలగింపునకు ఆదేశాలు జారీ అయ్యాయి. రెండు నెలల్లోపు ఈ కార్యాలయాన్ని అధికారులు కూల్చివేయనున్నారు. ఇప్పటికే తిరుమలగిరి మార్గంలో భూ సేకరణ ప్రక్రియ కొనసాగుతుంది. అందులో భాగంగా రోడ్డుకు సమీపంలో ఉన్న కార్యాలయం తొలగించాల్సిన పరిస్థితి వచ్చింది. కార్యాయలంలో ఆర్టీఏ సేవలతో పాటు మీసేవ కార్యాలయం కూడా కొనసాగుతుంది. రోజుకు వంద మంది సేవలను ఉపయోగించుకోవడానికి వస్తుంటారు. ఈ క్రమంలో ఆ కార్యాలయం కూల్చితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రవాణా శాఖ అధికారులు సైతం అభిప్రాయపడుతున్నారు. ముందుగానే మరో బిల్డింగ్ నిర్మించాక కూల్చివేతలు ప్రారంభిస్తే బాగుంటుందని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూడాలని వాహనదారులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణతో సుమారు 30 ఏండ్ల ఆ కార్యాలయం కనుమరుగు కానుందని తెలిపారు.

## విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు వేయాలి

అదనపు కలెక్టర్ జీ ముకుందరెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ జి.ముకుందరెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ, మదర్సాలు, గురుకులాలతో పాటు కలిపి మొత్తం 3,863 పాఠశాలల్లోని 10,17,239 మంది విద్యార్థులకు నుల్లి పురుగుల నివారణ మాత్రలు వేయాలని అదనపు కలెక్టర్ జి.ముకుందరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 10న జాతీయ నుల్లి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీ వార్మింగ్ మాత్రలు పిల్లల్లో శారీరక ఎదుగుదలకు తోడ్పడుతాయన్నారు. అధికారులందరు సమన్వయంతో పని చేసి నుల్లి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, డీఈవో ఆర్.రోహిణి, సీఎంవోహెచ్ డాక్టర్ పద్మజ, జిల్లా అధికారులు జి.ఆశన్న, ఆర్.కోటాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌ఎంఆర్‌ఎల్‌కు గార్డెన్ అవార్డులు




సిటీబ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఎనిమిది అవార్డులను సొంతం చేసుకున్నది. తెలంగాణ హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డెన్ ఫెస్టివల్–24 వేడుకల్లో ఉత్తమ ల్యాండ్ స్కేపింగ్ కేటగిరీలో 8 గోల్డ్ గార్డెన్స్ అవార్డులు, రోలింగ్ ట్రోఫీని గెలుచుకున్నది. గడిచిన ఆరేండ్లలో హెచ్‌ఎంఆర్‌ఎల్ అత్యుత్తమ అవార్డులను కైవసం చేసుకుంటూనే ఉంది. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో గురువారం జరిగిన అవార్డు ప్రదానం వేడుకలో హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా చేతుల మీదుగా అవార్డులను హెచ్‌ఎంఆర్‌ఎల్ హార్టికల్చర్ అధికారులు తీసుకున్నారు. వైవిధ్యమైన రూఫ్ టాప్ గార్డెన్ల నిర్వహణతో వరుస అవార్డులను మెట్రో సంస్థ గెలుచుకుంటుందని, పర్యావరణ పరిరక్షణలో, పచ్చదనం పెంపొందించేందుకు వినూత్న విధానాలను అవలంభిస్తామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తమకున్న పరిమితమైన స్థలాల్లోనే థీమ్ బేస్డ్ గార్డెన్లను అభివృద్ధితో అవార్డులను గెలుచుకోవడంపై సిబ్బందిని ఆయన ప్రశంసించారు.